చిన్న వయసులో రెండు ప్రభుత్వ ధ్రువప్రతాలు



నాగోలు: అతి చిన్న వయస్సులో రెండు భారత ప్రభుత్వ ధ్రువపత్రాలు కలిగిన చిన్నారికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. కొత్తపేట డివిజన్ న్యూ మారుతీనగర్‌కు చెందిన కార్తీక్ చౌహాన్ ఠాకూర్ స్రవంతి చావ్లా దంపతులకు ఈ ఏడాది ఏప్రిల్ 19న ఠాకూర్ మన్విక్ చౌహాన్ జన్మించాడు. ఈ చిన్నారి పుట్టిన 29 రోజుల్లో కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు తీసుకున్నారు. 65 రోజులకే పాస్‌పోర్టు హోల్డర్ అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు చిన్నారి వివరాలను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అప్‌లోడ్ చేయగా అతిచిన్న వయసులో రెండు భారత ప్రభుత్వ ధ్రువపత్రాలు కలిగిన చిన్నారిగా ఠాకూర్ మన్విక్ చౌహాన్‌కు ఇంటర్నేషన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన సత్యం అనారోగ్యంతో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.30 వేల చెక్కును ఆదివారం రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, రోహిత్, నరేందర్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి

నాగోలు: సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి రంగారెడ్డి జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ ఫోరం నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో వృద్ధుల సంచార వైద్యం (మొబైల్ మెడికేర్ యూనిట్) ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాండ్‌గౌడ్, డాక్టర్ శ్రీరాములు, చల్లా రాఘవరెడ్డి, మురళీధర్, అశోక్‌కుమార్, నర్సింహరెడ్డి, కోటిరెడ్డి, అశోక్‌కుమార్, కృపాకర్, బీమయ్య పాల్గొన్నారు.

ముగిసిన సురభి నాటకోత్సవాలు


బాలనాగమ్మ నాటకంలోని ఓ దృశ్యం

వనస్థలిపురం: ఆషాఢ మాస శతాబ్ది బోనాల ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో ఆరు రోజులుగా వనస్థలిపురం సురభి థియేటర్‌లో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలు ఆదివారంతో ముగిసాయి. చివరిరోజు బాలనాగమ్మ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. తమ నాటకాలను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు తెలిపారు. మున్ముందు మరిన్ని నాటక ప్రదర్శనలలో ప్రేక్షకులను అలరింపజేస్తామన్నారు.



తొలగించారు సరే.. తరలించేదెవరు?

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది వాటిని తరలించకుండా అక్కడే వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాటిని తొలగించే బాధ్యత మాది కాదంటే మాది కాదంటూ జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులకు ఒకరిపై ఒకరు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఫలితంగా పేరుకుపోతున్న చెట్ల కొమ్మలతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై వేసిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –ఎల్‌బీనగర్

అవగాహన..దోమల నివారణ!

- ప్రత్యేక కార్యక్రమానికి జీహెచ్ఎంసీ శ్రీకారం
- విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ అధికారులు

చంపాపేట: దోమల నివారణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వలంటీర్లుగా ఏర్పడి తమ పాఠశాలలతో పాటు ఇంటి పరిసరాలు, కాలనీలు, బస్తీలలో దోమల నివారణపై అవగాహన కల్పించేలా వారిని భాగస్వాములు చేసే దిశలో అధికారులు సరికొత్త ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగా ప్రతీరోజు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమలు వృద్ధి చెందడానికి కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరిస్తున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్–04 పరిధిలోని చంపాపేట, లింగోజిగూడ, హస్తినాపురం వంటి డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన, ర్యాలీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

తల్లిదండ్రులకు సైతం..

సర్కిల్ డీసీ జకియా సుల్తానా, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజని, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ మణి, సూపర్‌వైజర్ పెంటయ్య ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు.లార్వా దశలోనే అరికట్టగలిగితే దోమలు పెరిగే అవకాశాలు ఉండవని ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తల్లిదండ్రుల సహకారంతో తొలగించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు.దోమ కాటుతో వచ్చే ప్రాణాంతక రోగాలు, దోమల నివారణ చర్యలు, దోమల పరిణామ దశల గురించి తమ పాఠ్యాంశాలలో నేర్చుకున్న అంశాలు తమ ఇళ్లు, పరిసర ప్రాంతవాసులకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తు చేస్తున్నారు.

వలంటీర్లుగా ఏర్పడి..



14 నుంచి 22 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న విద్యార్థులను వలంటీర్లుగా తయారు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కేవలం విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా దోమల నివారణకు ఫాగింగ్ ఎలా చేయాలో చేసి చూపిస్తున్నాం. ఇప్పటికే చంపాపేట, కర్మన్‌ఘాట్, బైరామల్‌గూడ, లింగోజిగూడ, హస్తినాపురం, నందనవనం వంటి పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.
–మణి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్

త్వరలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు..



దోమల నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాల అనంతరం సర్కిల్ ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి ప్రతీ కాలనీవాసులకు వారంలో ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమంపై నిర్వహిస్తాం. ఇంటి పరిసరాలు, పగిలిన మట్టి పెంకులు, గాజు ప్లాస్టిక్ సీసాలు, కాలం చెల్లిన టైర్లలో నిలువ ఉన్న నీటిని తొలగించే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం.
–పెంటయ్య, ఎంటమాజీ సూపర్‌వైజర్

బీసీ కులగణనకు వినతి


మధుయాష్కీ గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దుర్గయ్యగౌడ్

హస్తినాపురం: బీసీల కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గయ్యగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలలో స్థానిక సంస్థల ఎన్నికల కన్నా ముందే బీసీ కులగణన చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కులగణన కోసం రూ.150 కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగిందని వెంటనే కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో మహబూబ్‌నగర్ పంచాయతీ రాజ్ చాంబర్ సెక్రటరీ యాచారం వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది యాదయ్య, బి.రవికుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు ఇలా.. టమాట రూ. 57, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 45, బీర రూ. 28, క్యాబేజీ రూ. 37, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 33, దొండ రూ. 35, చిక్కుడు రూ. 85, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 39, దోస రూ. 18, సొర రూ. 11, పొట్ల రూ. 16, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రజనీగోవింద్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రజనీగోవింద్

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్‌కాలనీకి చెందిన సంగీత విద్వాంసురాలు రజనీగోవింద్ డాక్టరేట్ అందుకున్నారు. కర్ణాటక సంగీతంలో చేస్తున్న సేవలను గుర్తించి ఆసియా ఇంటర్ నేషనల్ కల్చర్ రిసెర్చ్ యూనివర్సిటీ తెలంగాణ సారస్వతిక పరిషత్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా సంగీతంలో సేవలు అందిస్తున్నానని, 2017లో రాష్ట్ర గురుకుల కళాశాల సంగీత అధ్యాపకురాలిగా ఎంపికై మారుమూల విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

అనాథ విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేత



దిల్‌సుఖ్‌నగర్: కాచిగూడలోని వాసవి విద్యార్థిని వసతి గృహం కమిటీ సభ్యులు ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 1.20 లక్షల విలువ చేసే స్కూల్, కాలేజీ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్, బుక్స్, స్టేషనరీ, స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వాసవి విద్యార్థిని వసతి గృహ అధ్యక్షులు చిగుళ్లపల్లి ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని, కమిటీ వారు అనాథ పిల్లలను చేరదీసి వారికి భోజన, వసతి, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్‌కు నిరంతరంగా కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల చదువుల కోసం అవసరమైన బుక్స్, స్టేషనరీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, వాసవి వసతి విద్యార్థి గృహ ప్రధాన కార్యదర్శి మీలా నిర్మల, కోశాధికారి ఆకుల శైలజ వాణి, చైర్మన్ కోట్రికే విజయ గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సత్యసాయినగర్ కాలనీలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఆలయ చైర్మన్ వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళ్యాణానికి బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాజుల మధు, నాయకులు విక్కీసాగర్, తుమ్మల రమేష్, జిల్లా రాఘవేందర్, ముఖేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కొత్తగా రిజిస్టరైన ఆలయాలకు బోనాల నిధులు అందించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట: కొత్తగా దేవాదాయ శాఖలో నమోదైన ఆలయాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఈ విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అంబర్‌పేట డివిజన్‌లోని పేరొందిన అమ్మవారి ఆలయాల పేర్లను దేవాదాయ శాఖలో నమోదు చేశామని తెలిపారు. ఆయా అమ్మవారి ఆలయాల అభివృద్ధి, బోనాల పండగను వైభవంగా నిర్వహించుకునేందుకు ఆర్థిక సహాయం ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్ ముదిరాజ్ రత్నపాండే, రంగు ఉదయ్‌గౌడ్, వినయ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

రూ.1.50 లక్షల ఆభరణాలు మాయం

నాగోలు: ఆర్టీసీ బస్సులోని ఓ ప్రయాణికురాలి బ్యాగులో నుంచి బంగారు ఆభరణాలు చోరీ అయిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ వాస్తు కాలనీ చెందిన ఎస్.పద్మలత శుక్రవారం తన సోదరిణులు శైలజ, కళావతితో కలిసి తన బంగారు ఆభరణాలు రీమోడలింగ్ చేసేందుకు మల్లాపూర్‌లోని సూర్యనగర్ కాలనీ వెళ్లారు. అక్కడ బీడ్స్ చైన్15 గ్రాములు, బ్రాస్లెట్ 9 గ్రాములు, చిన్న బీడ్స్ చైన్ 4 గ్రాములు రీమోడలింగ్ చేసుకున్నారు. మల్లాపూర్ నుంచి హబ్సిగూడ ఆటో వచ్చి అక్కడ నుంచి ఎల్‌బీనగర్ ఆర్టీసీ బస్సు ఎక్కి కామినేని హాస్పిటల్ వద్ద దిగారు. కొద్ది దూరం వెళ్లి అనుమానం వచ్చి బ్యాగ్‌లో చూడగా బంగారు అభరణాలు కనిపించకపోవడంతో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ రూ.1.50 లక్షల ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ గ్రీన్‌రిచ్ కాలనీ, శ్రీవిద్యటౌన్‌షిప్ కాలనీల్లో ఆదివారం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. బోనాల పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో ఉన్న ఆలయాలను పరిశీలించి అందంగా అలంకరించేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని కోరారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోనాలు పూర్తికాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రవణ్‌కుమార్, గోపాల్, రవిందర్‌రెడ్డి, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న మేయర్ పారిజాత

క్రిమినల్ కేసులు పెట్టినా మారని తీరు!

రేషన్ అక్రమార్కులపై పీడీ యాక్ట్‌కు సిఫారసు

చంచల్‌గూడ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రేషన్ అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం, గోధుమలు పెద్ద మొత్తంలో బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. ప్రభుత్వ పేదలకు సరఫరా చేసే రేషన్ సరుకులను వివిధ రకాలుగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. మలక్‌పేట సర్కిల్ మాదన్నపేట పీఎస్ పరిధిలోని చావుణీ ప్రాంతం గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ నిల్వలకు అడ్డాగా మారడంతో సివిల్ సప్లై శాఖ అధికారులు గోదాములపై దాడులు నిర్వహిస్తూ పెద్ద మొత్తంలో బియ్యం, గోధుమలను స్వాధీనం చేసుకుంటున్నారు. పలుమార్లు దాడులు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నా అక్రమార్కుల తీరు మారడం లేదని మలక్‌పేట సివిల్ సప్లై అధికారి రాజశేఖర్ చెబుతున్నారు. గత కొంత కాలంగా దాడులు నిర్వహించగా చావుణీకి చెందిన మహ్మద్ ఇమ్రాన్, సలీం (జాఫర్) పలుమార్లు పట్టుబడ్డారని తెలిపారు. ఎంత కఠినంగా వ్యవహరించినా నిందితులు మాత్రం యథావిధిగా మళ్లీ రేషన్ సరుకులను నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, లబ్ధిదారుల నుంచి కొనుగోళ్లను అరికట్టేందుకు రేషన్ అక్రమార్కులపై పీడీ యాక్ట్‌లు నమోదు చేసే విధంగా పోలీసు శాఖకు సిఫారసు చేస్తామన్నారు. తాజాగా జరిగిన దాడుల్లో ప్రధాన నిందితుడు మహ్మద్ ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

దళారులతో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులకు అన్యాయం


మాట్లాడుతున్న వనేపల్లి శ్రీనివాస్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బాట సింగారం మార్కెట్‌లో లైసెన్స్ లేని ఏజెంట్లతో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులకు అన్యాయం జరుగుతుందని జాతీయ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్, తెలుగు డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వనేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం ఎన్టీఆర్ నగర్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నుంచి బాట సింగారం మార్కెట్‌కు ప్రతిరోజు రైతులు పెద్ద ఎత్తున్న డ్రాగన్ ఫ్రూట్స్ తీసుకువస్తున్నారని మార్కెట్ వద్ద ఎలాంటి రసీదులు లేకుండా 4 శాతం కమీషన్ తీసుకుంటున్నారన్నారు. అక్రమంగా రైతుల నుంచి వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.గత సీజన్‌లోనూ రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందిని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బాట సింగారం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులు అమ్ముకునే విధంగా స్థలం కేటాయించి రైతుల నుంచి కమీషన్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలుక నర్సింహారెడ్డి మాట్లాడుతూ..ఈ విషయం పైస్థాయి అధికారుల దృష్టి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, యాదగిరి, అనిల్‌కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలన్నీ అమలు చేయాలి


ప్రజాపాలన దరఖాస్తులు చూపిస్తున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం ఓడ మల్లన్న బోడ మల్లన్న అన్నట్లుగా మారిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ అన్నారు. కుర్మగూడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. వందల్లో ఒకరికి ఉచిత కరెంటు ఇచ్చి గ్యారంటీ అమలు చేశామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలకు మంగళం పడిందన్నారు. పదేళ్ల దొరల పాలన అంతం అయ్యిందని ప్రజలు సంతోషించే లోపే మోసగాళ్ల పాలన మొదలైందని బాధా పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఆరు గ్యారంటీలను అమలుచేసి నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బండా వెంకట్‌రెడ్డి, ఉగాది మహేష్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ అనుభవాలు సమాజానికి అవసరం


యాదిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: సీనియర్ సిటిజెన్స్ అనుభవాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని హుడా సాయినగర్ కాలనీలో హయత్‌నగర్ సర్కిల్ ఆసరా కమిటీ సంక్షేమ సంఘం, హుడా సాయి నగర్ కాలనీ సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు పాటి యాదిరెడ్డి ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాలలో పదవీ బాధ్యతలు నిర్వహించిన పాటి యాదిరెడ్డి జీవిత అనుభవాలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు డా.నాగేశ్వర్‌రావు, సభ్యులు నరసింహరావు, హరినాథ్‌బాబు, నాయకులు సంఘీ అశోక్, గోవిందా చారి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

బోడుప్పల్ : ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌లో స్వచ్ఛ భారత మిషన్‌లో భాగంగా ×పరిశుభ్రతను పాటించండి– రోగాలను తరిమి కొట్టండి₹ అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఇళ్లు, పెరట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చెత్త చెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉండేలా పరిసరాలను చూసుకోవాలన్నారు. కాలనీల్లో వ్యర్థాలను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు సహకరించాలని కోరారు.

కాచిగూడ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి


కాచిగూడ హాస్టల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు

కాచిగూడ: కాచిగూడలోని సాంఘిక సంక్షేమ విద్యార్థుల హాస్టల్ ఐదేళ్లుగా మూతబడి ఉందని.. దానిని వెంటనే పునః ప్రారంభించాలని హాస్టల్ పూర్వవిద్యార్థి రుద్రవరం లింగస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడ హాస్టల్ రి–ఓపెన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం హాస్టల్ భవనం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ అని తెలిపారు. హాస్టల్‌ను మూసేసి షెడ్యూల్ కులాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాకులతో కాచిగూడ హాస్టల్‌ను మూసేశారన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ముందుకొచ్చి హాస్టల్‌ను వెంటనే పునః ప్రారంభించాలన్నారు. నిరసనలో బోయిన శ్రీనివాస్, గిరి, బొమ్మెర రామూర్తి, సంగమేశ్వర్, కిరణ్, చారి, జగదీష్, రాము గోవింద్, భూషపాక గణేష్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.